RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైద్రాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి : 13 సంచిక : 274 | శనివారం, మార్చి 14 2026 | ఎడిటర్ : బట్టు లక్ష్మీనారాయణ. | పేజీలు : 6 వెల : రూ. 5.00

Hyderabad, Vijayawada, Vishakapatnam Tirupathi, Ananthapuram,Guntur,Nellor,Ongole,kadapa, Medak, Sangareddy, Siddipet, Nalagonda, Karimnagar,

### అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు

## సిద్ధం చేయండి

**- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు**



2లో

### ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

**- ప్రమాణ స్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్**



2లో



## దేశంలో గ్యాస్ కొరత లేదు

**- ప్యానిక్ బుకింగ్స్ అవసరం లేదు: కేంద్రప్రభుత్వం స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ,మార్చి 13 :** పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ కొరత ఆందోళన కలిగిస్తున్న నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. ఎలాంటి భయాందోళనలు వద్దని, 'ప్యానిక్ బుకింగ్' అవసరం లేదని తెలిపింది. సంక్షోభం లేదని వివరించింది. గృహావసరాల కోసం ఎలాంటి అంతరాయం లేకుండా పైపుల ద్వారా సహజ వాయువు , కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ సరఫరాకు భరోసా ఇచ్చింది. పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాతా శర్మ శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ, ఆసుపత్రులు, హాస్టల్స్‌కు ఎల్‌పీజీ సరఫరాకు తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్టు

మిగతా2లో...

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

- 20 టిఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం
- అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది
- ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
- వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు
- నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
- మూసీ ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?




**హైదరాబాద్,మార్చి 13 :** మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బృహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వైట్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రెండేళ్లుగా నిపుణులు, అధికారులతో క్షుణ్ణంగా ప్రతి అంశం పరిశీలించామని చెప్పారు. నిజాంలు, బ్రిటీషర్లు సికిం ద్రాబాద్ నగరాన్ని నిర్మించారు. ఈసీ, మూసీ వరదల నియంత్రణకు ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తి తీరుస్తున్నాయి. ప్రపంచ పరిణామాలు, పర్యావరణ మార్పులను పరిగణనలోకి తీసుకోవాలి. అపార మేధో సంపత్తి

మిగతా2లో...



## నేటినుంచి తెలంగాణ పదో తరగతి పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు

**హైదరాబాద్,మార్చి 13** తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిముషాల ఆలస్యాన్ని పరి గణనలోకి తీసుకుంటారు. రాష్ట్ర వ్యాప్తంగా

మిగతా2లో...

### అసోంలో రూ.4,500 కోట్ల

## విలువైన ప్రాజెక్టులు

- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన మోడీ
- కామాఖ్య-చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ప్రారంభం



**గువాహటి,మార్చి 13 :** అస్సాం అసెంబ్లీ ఎన్నికల వేళ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారంనాడు ఆ రాష్ట్రంలో పర్యటించారు. రూ. 4,500 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు శంకుస్థాపనలు చేశారు. షెడ్యూల్ ప్రకారం కోకరాఝార్‌లోని బహిరంగ సభలో మోదీ ప్రసంగించాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత కారణంగా వేదిక

మిగతా2లో...

## మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే...

● ఇళ్లను కూలగొట్టడంపైనే మా అభ్యంతరం ● మూసీ నీటితో రైతులకు మేలు జరిగితే స్వాగతిస్తాం ● మూసీకి ముందు సబర్మతిపై అధ్యయనం చేయండి ● పదేపదే బిజెపిని విమర్శించడం అపండి ● తెలంగాణ బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు



**హైదరాబాద్,మార్చి 13 :** మూసీ ప్రాజెక్ట్‌పై బీజేపీకి వ్యతిరేకత లేదని.. కాని పేదల ఇళ్లు కూల్చడాన్ని మాత్రం వ్యతిరేకిస్తామని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు కౌంటర్‌గా రాంచందర్ రావు శుక్రవారం హైదరాబాద్‌లో మాట్లాడారు. మూసీపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. మూసీ నది పునరుజ్జీవనానికి కానీ.. మూసీ ప్రాజెక్ట్‌ను కానీ బీజేపీ ఎప్పుడూ వ్యతిరేకించలేదని తెలిపారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండా లని.., అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని.. ఆ నీరు రైతులకు

మిగతా2లో...

## నా... మాట!

కదలిరండి యువతరమా!
తెలంగాణ నవ నిర్మాణానికి దారులు వేద్దాం..
ప్రశ్నించే గళలామై ప్రజలను మేలుకొలుపుదాం..
నిర్భంధాలతో నోళ్లు మూపిస్తున్నా,పాలకుల
కండ్లు తెరిపిద్దాం..
రాష్ట్రాన్ని అప్పుల కుంపటిగా మార్చిన రాజకీయ
దొంగలను తరిమికొడుదాం..
ఈ అణిచివేత,అన్యాయాలను భరించలేక,
పిడికిళ్లను బిగిద్దాం..
ఉద్యమాలు లేకుండా ఏ చరిత్ర లేదు.
నీ శ్రమను గుర్తించే రోజులు కావు..
కబ్జాకోరల్లో నలిగిపోతున్న రాష్ట్రమిది..
ఇప్పుడు ఎదిరిస్తేనే బతకాగలం..
మూర్ఛపోయినా ప్రజాస్వామ్యన్ని తట్టిలేపెందుకు..
కారుచిచ్చువై అవినీతి భూతన్ని తాగులబెడుదాం..
దొంగ,దోపిడీ వ్యవస్థలను నిట్టానిలువునా కాల్చేద్దాం..
అగ్రకుల,రాజకీయాలను కూల్చేద్దాం.
అవినీతి నాయకుల గుండెల్లో గునపమై,
ఓటు గొప్పతనం విప్పి చెప్పుదాం..
సామజిక తెలంగాణాను నిర్మిద్దాం..

పెద్దపల్లి రాజన్న...
9848174314

### ఇంధన, గ్యాస్ కొరతపై

## ప్రభుత్వం సమీక్ష

- కేంద్రం మార్గదర్శకాలకు అనుగుణంగా చర్యలు
- అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చిన మంత్రి ఉత్తమ్
- మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం కమిటీలు



**హైదరాబాద్,మార్చి 13 :** దేశవ్యాప్తంగా నెలకొన్న ఇంధన, గ్యాస్ సరఫరా పరిణామాలపై తెలంగాణ ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టింది. అత్యవసర సేవలకు ఎటువంటి ఆటంకం కలగకుండా గ్యాస్ సరఫరాను క్రమబద్ధీకరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. గ్యాస్ సరఫరా అనేది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని గుర్తు చేస్తూ.. ప్రస్తుత పరిస్థితులపై మంత్రి ఉత్తమ్ పలు కీలక వివరాలను వెల్లడించారు. మార్కెట్‌లో కొంత మేర గ్యాస్ కొరత ఉందని కేంద్ర ప్రభుత్వమే స్వయంగా ప్రకటించిందని, దానికి అనుగుణంగా రాష్ట్రాలకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసిందని మంత్రి

మిగతా2లో...

## తిరుమల లడ్డూపై పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, 13**

తిరుమల లడ్డూ వ్యవహారంలో దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు ఈ వ్యవహారంపై కామెంట్లు చేయకుండా నిలువరించాలని మానూరు శ్రీనివాస్ పిటిషన్ వేశారు. ఈ కామెంట్లపై సీబీఐ

మిగతా2లో...

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# అసెంబ్లీ ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయండి

**హైదరాబాద్,మార్చి 13** ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. సెంబ్లీ సమావేశాల ప్రారంభం నేప థ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బ్జడెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బ్జడెట్ సమావేశాల నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ఉందని చెప్పేవారు ప్రాజెక్టులు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏమైనా తప్పులు చేస్తే సలహాలు, సూచనలు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నాం అని బిఆర్ఎస్‌ను ఉద్దేశించి అన్నారు. మూసీ, ఈసీ సంగమ స్థానం లంగర్ హౌస్ వద్ద బాపూ ఘాట్‌ను పర్యాటక కేంద్రం చేస్తాం అన్నారు. కృష్ణా, గోదావరి జలాలతో ప్రజల దాహార్తి తీర్చాలని ప్రయత్నించాం. గోదావరి జలాలు 20 టీఎంసీలను మూసీకి తరలించే పనులు చేపట్టామని అన్నారు. మూసీలో నిరంతరం 2.5 టీఎంసీల గోదావరి జలాలు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా 17.5 టీఎంసీల గోదావరి జలాలతో హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చేయత్నం చేస్తున్నాం. ఎంతో ఘనమైన మూసీ చరిత్ర కాలగర్భంలో కలిసిపోతోంది. రాజకీయ ప్రయోజనాల కోసం చరిత్రను కాలగర్భంలో కలిపేద్దామా అని ప్రశ్నించారు. మేం చేపడుతున్న ప్రాజెక్టు ఎవరికీ వ్యతిరేకం కాదు. పాతబస్తీలో మెట్రో, రోడ్ల విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయి. అభివృద్ధి పనుల కోసం రూ. వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులను పునరుద్ధరిస్తున్నాం. అందుకు ప్రజలు మాకు ఘన స్వాగతం పలుకుతున్నారు. మూసీ అభివృద్ధిని అడ్డుకుంటున్నవాళ్లు.. మూసీ పక్కన నివసిస్తారా? అలాంటి వాళ్లకు కంటెయినర్ హౌస్‌లు ఇస్తా.. అక్కడ నివసిస్తారా? మూసీకి వరదలొస్తే వేలాదిమంది నిరాశ్రయులవుతున్నారు. నీళ్లు ప్రవహించే ప్రాంతాలను మనం ఆక్రమించుకోవడం వల్లే వరదలొస్తున్నాయి. మూసీ ప్రక్షాళన చేయకపోతే నల్గొండ ప్రజలు తీవ్రంగా నష్టపోతారు. భవిష్యత్ తరాలకు కోలుకోలేని దెబ్బ తగులుతుంది. వారి బాధల్ని కూడా పరిగణలోకి తీసుకొని ప్రాజెక్టుపై ముందుకు వెళ్తున్నాం. దీనికి అందరి సహకారం కావాలని రేవంత్‌రెడ్డి అన్నారు.మూసీ ప్రాజెక్టుపై కొందరు ఉద్దేశపూర్వకంగా ప్రజల్ని ఆందోళనకు గురి చేశారని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మరికొందరు అసంపూర్తి సమాచారంతో తప్పుడు ప్రచారం చేశారన్నారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత తనపై ఉందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఇతర దేశాలు వేగంగా అభివృద్ధి వైపు పయనిస్తున్నాయని తెలిపారు. మనం కూడా అభివృద్ధి వైపు పయనించాలనే మూసీ పునరుజ్జీవం చేస్తున్నట్లు సీఎం రేవంత్ వివరించారు. ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారం ఇచ్చారన్నారు. వారికి తాము కాపాలదారులుగా ఉంటామని స్పష్టం చేశారు. సింగపూర్, దుబాయ్, లండన్, సియోల్ నగరాలలో తాను పర్యటించానని చెప్పారు. మనకు ఏం అవసరమో అక్కడ స్టడీ చేసి వచ్చామన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోనే ఆర్థిక వ్యవస్థ విరాజిల్లిందన్నారు. గొప్ప నగరం హైదరాబాద్‌ను నిజాం రాజులు మనకు అందించారని తెలిపారు. వందేళ్ల క్రితం నిర్మించిన జలాశయాలు నేటికీ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని చెప్పారు. మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు. తమకు పొలిటికల్ డిఫరెన్స్ ఉండొచ్చు.. కానీ పొలిటికల్ పెరాలసిస్ లేదని కుండబద్దలు కొట్టారు. మూసీ పునరుజ్జీవనాన్ని బీఆర్ఎస్, బీజేపీలు ఎందుకు వ్యతిరేకిస్తున్నాయని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వ్యతిరేకించడం కాదు.. ఎలా చేద్దామో సలహా ఇవ్వండంటూ ఆయా పార్టీల అధినేతలు, అగ్రనేతలకు సీఎం రేవంత్ సూచించారు. మీ సలహాలు స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రపంచంతో పోటీ పడుతూ అభివృద్ధి జరగొద్దా? అని ఆయా పార్టీల నేతలకు సీఎం రేవంత్ ఈ సందర్భంగా చురకలంటించారు. అపార మేధో సంపత్తి ఉందని చెప్పేవారు ప్రాజెక్టుల్ని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ బీఆర్ఎస్ నాయకులపై మండిపడ్డారు. పాలసీలు, వర్కింగ్ స్టైల్ మార్చుకున్నామని చెప్పారు. కొద్దిమంది ముఖ్యమంత్రులే ప్రజలకు గుర్తున్నారని పేర్కొన్నారు. వారు వేసిన పునాదులే అలా గుర్తుంచుకునేలా చేశాయని చెప్పారు. ఎంతసేపు రంగారెడ్డి జిల్లా గురించే ఆలోచిస్తున్నారన్నారు. నల్గొండ జిల్లా గురించి ఎవరైనా ఆలోచిస్తున్నారా? అని ప్రశ్నించారు.

# నేటినుంచి తెలంగాణ పదో తరగతి పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

5,28,239 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 5,17,727మంది రెగ్యులర్, ఒకసారి ఫెయిలైన 10,512మంది విద్యార్థులు ఉన్నారు. ఈసారి ప్రైవేటు పాఠశాల నుంచి అత్యధికంగా 2,50,015 విద్యార్థులుండగా, ప్రభుత్వ బడుల నుంచి 2,07,573 మంది, సంక్షేమ గురుకులాల నుంచి 60,139 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 1,582 ప్రభుత్వ, 1,094 ప్రైవేటు విద్యాసంస్థలు ఉన్నాయి. హాల్ టికెట్లు ఇప్పటికే అన్ని పాఠశాలకు పంపించామని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పాఠశాల విద్యాశాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తెలిపారు. పాఠశాల గుర్తింపు తెలియకుండా సాధారణ దుస్తుల్లోనే విద్యార్థులు పరీక్షకు రావాలని కోరారు. పరీక్షల పర్యవేక్షణకు 144 ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30వరకు ఉంటాయి. పదవ తరగతి పరీక్షల సమయం సమీపిస్తున్న కొద్ది విద్యార్థుల్లో ఒత్తిడి మొదలవుతుంది. ఒత్తిడిని జయించడానికి విద్యార్థులు ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివితే మంచి మార్కులతో ఉత్తీర్ణులవుతారని నిపుణులు సూచిస్తున్నారు. ఇతర ఆలోచనలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పరీక్షల సమయంలో సెల్‌ఫోన్, టీవీ వైపు మనస్సు మరలకుండా చూసుకోవాలి. ప్రతిరోజూ విద్యార్థి ఏర్పాటు చేసుకున్న టైం టేబుల్ ప్రకారం చదువుకోవాల్సి ఉంటుంది. సందేహాలను విద్యార్థులు ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. అందుకోసం తరగతి ఉపాధ్యాయులు లేదా, మంచి స్నేహితులు, సీనియర్ల ద్వారా సందేహాలను నివృత్తి చేసుకోవాలి.పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇంట్లో చక్కటి వాతావరణం కల్పించాలి. విద్యార్థిలో ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ప్రతిక్షణం కృషి చేయాలి. అవసరమైన ధైర్యం అందివ్వాలి. పిల్లలు ఎక్కువ సమయం చదువుకే కేటాయిస్తారు కనుక వారి ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి. సమయానుకూలంగా విద్యార్థికి తగిన పౌష్టికాహారం అందించే ఏర్పాట్లు చేయాల్సి ఉంటుంది. సమయానికి తగినంత నిద్రపోయేలా కూడా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేశాం. ఇప్పటికే రెండు ప్రీఫైనల్ పరీక్షలను నిర్వహించి విద్యార్థులకు మనోధైర్యాన్ని కల్పించాం. గణితం, సైన్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులలో మంచి మార్కులు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. మార్చి 14 వ తేదీ నుంచి ఏప్రిల్ 16 వరకు పరీక్షలను నిర్వహిస్తున్నాం అని అధికారులు వివరించారు.

# మూసీ ప్రక్షాళలను ఎప్పుడూ వ్యతిరేకించలే...

(మొదటి పేజీ తరువాయి)

సాగునీటి కోసం ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి కానీ, మంత్రి పొన్నం ప్రభాకర్ కానీ.. బీజేపీపై రకరకాల వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. కానీ మూసీ విషయంలో బీజేపీ వైఖరి మొదటి నుంచీ ఒకటేనని గుర్తు చేశారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని తమ పార్టీ ఇప్పటికీ చెబుతుందన్నారు. కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్య తరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదన్నారన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని తెలిపారు. ఆ ఇళ్లను కూల్చకుండానే మూసీని శుద్ధి చేయవచ్చునన్నారు. సబర్మతి నదిని ఉదాహరణగా తీసుకునే వారు.ముందుగా అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా ఏర్పాటు చేశారో తెలుసుకోవాలంటూ కీలక సూచన చేశారు. ఒకప్పుడు సబర్మతి సైతం మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టిన తర్వాత.. నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేయడం ద్వారా ఆ నదిని శుభ్రపరిచారని చెప్పారు. అక్కడ నివసిస్తున్న పేద కుటుంబాలను ముందుగా పునరావాసం కల్పించి.. ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు చేపట్టారని గుర్తు చేశారు. సుమారు 4 వేల కుటుంబాలకు ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టారని, ప్రజల జీవితం దెబ్బతినకుండా జరిగేదే నిజమైన అభివృద్ధి అని పేర్కొన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న కుటుంబాలను నిరాశ్రయులను చేయడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లు కూల్చడం అన్యాయమన్నారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రియలైన్ చేసుకోవచ్చని సూచించారు. ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి బీజేపీకి ఎలాంటి అభ్యంతరం లేదని తెలిపారు. కానీ పేదల ఇళ్లు కూల్చి వారి జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం బీజేపీ తప్పకుండా వ్యతిరేకిస్తుందని హెచ్చరించారు. ముందుగా మూసీని శుద్ధిచేసి, ఆ తర్వాత అభివృద్ధి పనులు చేపట్టాలని, దానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో యుద్ధాలు, ఉద్రిక్తతలు ఉన్నప్పుడు వాటి ప్రభావం ప్రపంచవ్యాప్తంగా, భారతదేశంపైనా కనిపించవచ్చని, కానీ అదే పేరుతో దేశంలో కొరత వస్తుందని భయాందోళనలు సృష్టించడం సరికాదన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్, ప్రధాని నరేంద్ర మోదీ.. సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరా హోర్ముజ్ జలసంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. భారతదేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదన్నారు. యుద్ధ పరిస్థితుల వల్ల రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చుని.. కానీ ఇంధన కొరత మాత్రం ఉండదని స్పష్టం చేశారు. ప్రపంచంలో ఎలాంటి పరిస్థితులు వచ్చినా భారత ప్రజలు వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన వారని చెప్పారు. అలాంటి సమయంలో నాయకులు.. ప్రజల్లో ధైర్యం నింపాల్సిందే తప్ప, భయాందోళనలు కలిగించడం పెద్ద తప్పు అని పేర్కొన్నారు. దేశంలో గృహ వినియోగ ఎల్‌పీజీ, గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత ఉండదని ప్రధాని ఇప్పటికే స్పష్టం చేశారని గుర్తు చేశారు. సాధారణ ప్రజలకు ఇంధన సరఫరా నిరంతరం కొనసాగుతుందని కేంద్ర ప్రభుత్వం సైతం హామీ ఇచ్చిందన్నారు. అందువల్ల వాస్తవాలు తెలుసుకోకుండా ప్రజల్లో భయాందోళనలు కలిగించే వ్యాఖ్యలు చేయడం సరికాదని బీజేపీ రాంచందర్ రావు తెలిపారు.

# ఏపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం

**అమరావతి,మార్చి 13 :**ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. హైకోర్టు ఆవరణలో జరిగిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సుల మేరకు పంజాబ్, హరియాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు నుంచి జస్టిస్ లిసా గిల్ ఏపీ హైకోర్టుకు బదిలీపై వచ్చారు. కేంద్ర న్యాయశాఖ ఉత్తర్వుల మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఏపీ హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో రెండో స్థానంలో కొనసాగుతారు. హైకోర్టు సీజే జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ సీజేగా నియమితులు కానున్నారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయ మూర్తిగా ఆమె చరిత్ర పుటలకెక్కనున్నారు. హైకోర్టు న్యాయమూర్తులు, రిజిస్ట్రార్ జనరల్, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, పలువురు సీనియర్ న్యాయవాదులు తదితరులు హాజరయ్యారు. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా.. ప్రస్తుతం 33 మంది ఉన్నారు. జస్టిస్ లిసా గిల్ రాకతో ఈ సంఖ్య 34కు పెరిగింది. ప్రస్తుత సీజే జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఈ ఏడాది ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ తర్వాత ఆమె సీజేగా నియమితులు కానున్నారు. ఏపీ తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా రికార్డ్ సృష్టించనున్నారు.

# దేశంలో గ్యాస్ కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. మార్చి 2026తో పోల్చుకుంటే దేశంలో ఎల్‌పీజీ ఉత్పత్తి 40 శాతం పెరిగిందని, అదనంగా రాష్ట్రాలకు 48,000 కిలోలీటర్ల (సుమారు 48 మిలియన్ లీటర్లు) కిరోసిన్ పంపిణీ చేశామని తెలిపారు. హోటళ్లు, రెస్టారెంట్లకు బొగ్గు సరఫరా చేయాలని కోల్ ఇండియాను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. మధ్యప్రాచ్యంలో యుద్ధానికి ముందు యావరేజ్‌గా 55.7 లక్షల బుకింగ్‌లు ఉంటే మార్చి 12 నాటికి అది 75.7 లక్షలకు పెరిగిందని, భయాల కారణంగానే బుకింగ్‌లు అనూహ్యంగా పెరిగాయని సుజాతా శర్మ తెలిపారు. ఎల్పీజీపై ఒత్తిడి తగ్గేందుకు పీఎన్‌జీ కనెక్షన్లకు మళ్లాలని ప్రజలను కోరారు. క్రూడాయిల్‌కు సంబంధించి 258 మిలియన్ మెట్రిక్ టన్నుల కెపాసిటీ మనకు ఉందని, పెట్రోల్, డీజిల్ ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని కలిగి ఉన్నామని వివరించారు. ప్రధానమైన అర్బన్ సిటీలు, కేంద్రాల్లో కమర్షియల్ వినియోగదారుల ఆందోళన, సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని చెప్పారు. కమర్షియల్ వినియోగదారులు స్థానిక సీజీడీ (సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్) నెట్‌వర్క్ ప్రొవైడర్‌ను కానీ, సంబంధిత డీలర్‌ను కానీ సంప్రదించి పీఎన్‌జీ కనెక్షన్ పొందవచ్చని సూచించారు. దేశంలోని అన్ని పెట్రోల్ పంపుల్లో తగినన్ని పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని, బంక్‌లు ఖాళీ అయినట్టు 25,000 డిస్ట్రిబ్యూటర్లలో ఏ ఒక్కరి నుంచీ తమకు సమాచారం లేదని సుజాతా శర్మ తెలిపారు. వదంతులను విశ్వసించవద్దని, ప్యానిక్ బైయింగ్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# అసోంలో రూ.4,500 కోట్ల విలువైన ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

వద్దకు చేరుకోలేకపోయారు. దీంతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ కార్యక్రమంలో పాల్గొన్నారు. అస్సాం అభివృద్ధికి రూ.4,500 కోట్లతో పలు పనులు ప్రారంభించామని, ఇందులో రూ.1,100 కోట్లు బోడోలాండ్ ప్రాంతంలోని రోడ్ల కోసం ఖర్చు చేయనున్నామని చెప్పారు. అస్సాం మేళా ఇనిషియేటివ్ మూడో దశలో అస్సాంలో రోడ్ల అనుసంధానం మరింత పటిష్టమవుతుందని అన్నారు. ఈ సందర్భంగా కామాఖ్య–చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గౌహతి–న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్‌లను మోదీ జెండా ఊపి ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ బోడోలాండ్‌ను తప్పుడు హామీలతో దశాబ్దాలుగా వంచించిందని, బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే బోడోలాండ్ ప్రాంత ప్రజల కలలు సాకారమయ్యాయని అన్నారు. అటు కేంద్రంలో, ఇటు అస్సాంలో కాంగ్రెస్‌కు ప్రజలు ఉద్వాసన చెప్పి బీజేపీ–ఎన్డీయేకు అవకాశం ఇవ్వడంతో చిత్తశుద్ధితో తాము అభివృద్ధి పనులు చేపట్టామని చెప్పారు. కాంగ్రెస్ వివిధ గ్రూపుల మధ్య అసంతృప్తిని పెంచితే, శాంతి కోసం బీజేపీ పాటుపడిందని, బోడో పీస్ ఒప్పందంపై సంతకం చేసి అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చిందని చెప్పారు. అస్సాంలో చొరబాటుదారులను కాంగ్రెస్ ప్రోత్సహించిందని, గిరిజనుల భూములను అక్రమంగా చొరబాటుదారులకు కట్టబెట్టిందని మోదీ విమర్శించారు. అయితే గిరిజనుల భూములు వారికే తిరిగి ఇప్పించేందుకు ముఖ్యమంత్రి శర్మ అవిశ్రాంతంగా కృషి చేశారని కొనియాడారు. దీనికి ముందు, అస్సాంలో రెండ్రోజుల పర్యటన కోసం గౌహతి వచ్చిన మోదీకి రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ ఆచార్య, ముఖ్యమంత్రి హిమంత బిశ్వా శర్మ, పలువురు రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు సాదర స్వాగతం పలికారు.

# శ్రీశైలం వెళ్లిన గవర్నర్ శుక్లా

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్‌కు శుక్రవారం సాయంత్రం చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం అనంతరం శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వెళ్లారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల లడ్డూపై టిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

ఎలాంటి దర్యాప్తు జరపలేదని పేర్కొన్నారు. అయితే.. దర్యాప్తు పెండింగ్‌లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోలేమని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేస్తూ పిటిషన్ కొట్టివేసింది. అన్ని అంశాలు పరిశీలించాకే సీబీఐతో సిట్ వేయించామని పేర్కొంది. ఏదైనా ఉంటే సీబీఐ ముందే చెప్పుకోవాలని సూచించింది.

# ఇంధన, గ్యాస్ కొరతపై ప్రభుత్వం సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గ్యాస్ ప్రొడక్షన్‌ను పెంచామని కేంద్రం తెలిపిందని, ఈ నేపథ్యంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలతో సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్రానికి 1740 కిలో లీటర్ల కిరోసిన్ సరఫరా చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో సివిల్ సప్లై కమిషనర్, పోలీస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులతో రాష్ట్ర స్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. ప్రతి జిల్లాలో కలెక్టర్, ఎస్పీ, వైద్య అధికారులు ఒఖఉ కంపెనీ ప్రతినిధులతో కూడిన కమిటీలు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తాయి. కమాండ్ కంట్రోల్ రూమ్: హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయంలో ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి, సరఫరాలో అంతరాయాలను నివారిస్తున్నారు. తమను కూడా అత్యవసర సేవల కింద గుర్తించి సిలిండర్లు సరఫరా చేయాలని హోటల్, రెస్టారెంట్ యజమానులు చేసిన విజ్ఞప్తిని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అత్యవసర సేవలకు గ్యాస్ కొరత లేకుండా చూసే పూర్తి బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుందని ఉత్తమ్ చెప్పారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి నివాళులు

**- ఇబ్రహీంపట్నం ప్రజలు మరో పుచ్చలపల్లి సుందరయ్యను కోల్పోయారు, ఎమ్మెల్యే వ్యాఖ్య**





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్13:-ఇబ్రహీంపట్నం మాజీ శాసనసభ్యుడు కొండిగారి రాములు మృతి పట్ల ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన భౌతిక కాయానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కొండిగారి రాములు ఒక మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలు మరో పుచ్చలపల్లి సుందరయ్యను కోల్పోయారని అన్నారు. పేదరిక నిర్మూలన కోసం రాములు చేసిన పోరాటం మరువలేనిదని పేర్కొన్నారు. రాజకీయాల్లో మచ్చలేని నాయకుడిగా ఆయన నిలిచారని ఎమ్మెల్యే చెప్పారు. అధికార దాహంతో పార్టీలు మారే నాయకులు ఉన్న ఈ కాలంలో, తన నమ్మిన సిద్ధాంతాల కోసం ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా తట్టుకుని నిలిచిన వ్యక్తి కొండిగారి రాములు అని అన్నారు. శాసనసభ్యుడిగా పనిచేసిన సమయంలో తనకు వచ్చిన జీతాన్ని కూడా పార్టీ కోసం విరాళంగా ఇచ్చిన గొప్ప నాయకుడు రాములు అని ఎమ్మెల్యే గుర్తుచేశారు. దాదాపు దశాబ్ద కాలం ఎమ్మెల్యేగా పనిచేసినా స్వార్థం లేకుండా ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని అన్నారు. అనగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం వర్ణించలేనిదని, చివరి శ్వాస వరకు తన సిద్ధాంతాలకు కట్టుబడి జీవించిన వ్యక్తి రాములు అని పేర్కొన్నారు. ఆయన జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కొండిగారి రాములు అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వంతో మాట్లాడినప్పటికీ కొన్ని అడ్డంకులు ఉన్నాయని ఎమ్మెల్యే తెలిపారు. అందుకే కుటుంబానికి ఎలాంటి భారం పడకుండా అంత్యక్రియల ఖర్చును తానే భరిస్తానని ప్రకటించారు. రాములు భౌతికంగా మన మధ్య లేకపోయినా నియోజకవర్గ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్యే అన్నారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# రాజకీయ రంగంలోకి తెలంగాణ జాగృతి ఇది చారిత్రాత్మక అవసరం: కప్పాటి పాండురంగారెడ్డి

**- కవిత జన్మదిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్13:-తెలంగాణ సాంస్కృతిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థ రాజకీయ పార్టీగా అవతరించడం కాలానుగుణమైన చారిత్రాత్మక అవసరమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకొని నగరంలోని ఆమె నివాస కార్యాలయంలో కప్పాటి పాండురంగారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పూల మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, తెలంగాణ ఉద్యమ కాలం నుంచి నేటి వరకు తెలంగాణ సాంస్కృతిక చైతన్యాన్ని ప్రజల్లో రగిలించడంలో తెలంగాణ జాగృతి కీలక పాత్ర పోషించిందని అన్నారు. ఇప్పుడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా రూపాంతరం చెందడం ఒక ముఖ్యమైన మలుపు అని అభివర్ణించారు. తెలంగాణ అస్థిత్వాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేసిన కవిత అదే స్ఫూర్తితో రాజకీయ రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తుందని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజాసేవకుడు కొండిగారి రాములు మృతి ఘన నివాళులతో స్మరించిన సబితా ఇంద్రారెడ్డి

**- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి ఘన నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి**





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్13:-ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు హఠాన్మరణం చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, స్వర్గీయ కొండిగారి రాములు రెండుసార్లు ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా సేవలందించి ప్రజల విశ్వాసాన్ని పొందిన ప్రజానాయకుడని తెలిపారు. ముఖ్యంగా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని కందుకూరు, మహేశ్వరం మండలాల్లో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారని గుర్తుచేశారు. “ఇలాంటి ప్రజాసేవకుడు ఇక మన మధ్య లేరన్న విషయం చాలా బాధాకరం. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నాను. అలాగే వారి కుటుంబ సభ్యులకు ఈ దుఃఖాన్ని భరించే ధైర్యాన్ని దేవుడు ప్రసాదించాలని కోరుకుంటున్నాను” అని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేష్ మరియు
ఇతర నాయకులు, కార్య కర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కొండిగారి రాములు కి నివాళులు అర్పించారు.

# తెలంగాణలో వాహన రిజిస్ట్రేషన్లకు కొత్త విధానం నేటి నుంచి పూర్తిగా ఆన్‌లైన్ ప్రక్రియ

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 13:-తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ వాహన రిజిస్ట్రేషన్ ప్రక్రియలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. నేటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా వాహనాల పర్మనెంట్ రిజిస్ట్రేషన్ పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహించనున్నారు. ఇకపై రిజిస్ట్రేషన్ కోసం రవాణా శాఖ కార్యాలయాలకు భౌతిక పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. ఈ కొత్త విధానం ద్వారా వాహనదారులు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా సమయం ఆదా అవుతుందని, అలాగే వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానం ప్రకారం తాత్కాలిక రిజిస్ట్రేషన్ పూర్తైన తర్వాత ఏడు రోజులలోపు సంబంధిత డీలర్లు వాహన యజమాని మరియు ఫైనాన్షియర్ సంతకాలతో కూడిన ఫారం-20తో పాటు అవసరమైన ఇతర పత్రాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. డిజిటల్ విధానంపై రవాణా శాఖ అధికారులు కఠిన నిబంధనలు కూడా అమలు చేస్తున్నారు. ఆన్‌లైన్‌లో సమర్పించిన పత్రాలను పరిశీలించి, రెండు పని దినాల్లోనే పర్మనెంట్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ



పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎవరైనా తప్పుడు సమాచారం అందించినా లేదా నకిలీ పత్రాలను అప్‌లోడ్ చేసినా వారిపై కఠిన క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ హెచ్చరించింది. ఈ మార్పుతో ఆర్టీఏ కార్యాలయాల చుట్టూ తిరిగే పని తగ్గి, దళారీల బెడద కూడా తగ్గుతుందని సామాన్య వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూర్తి స్థాయి డిజిటలైజేషన్ దిశగా తెలంగాణ రవాణా శాఖ తీసుకున్న ఈ నిర్ణయం కీలక మైలురాయిగా నిలవనుంది.

# ‘అవంతి’కి అటానమస్ హోదా



హైదరాబాద్, మార్చి13: అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలోని గుంతపల్లి గ్రామంలో గల అవంతి విద్యాసంస్థల ఆవరణలో ఉన్న అవంతి ఫార్మసీ కళాశాలకు యూజీసీ స్వయం ప్రతిపత్తి హోదా (అటానమస్) లభించింది. ఈ హోదా దాదాపు పదేళ్ల పాటు కొనసాగనున్నట్లు కళాశాల చైర్మన్ ముత్తెంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. దీంతో పాటు జెఎన్టీయూహెచ్ నుంచి కూడా స్వయంప్రతిపత్తి హోదా లభించిందని హర్షం వ్యక్తం చేస్తూ కళాశాలలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. విశిష్టమైన గుర్తింపు లభించడంతో తమ విద్యాసంస్థల్లో విద్య నాణ్యతతో పాటు పరిశోధన, విద్యార్థుల అభివృద్ధి కోసం మరింత కట్టుబడితో పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఫ్యాషన్ డిజైనింగ్ లో ఉచిత టైలరింగ్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



కూకట్ పల్లి, మార్చి 13: నేషనల్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ డిజైనింగ్ కూకట్ పల్లి ఆధ్వర్యంలో మహిళలకు 15 రోజుల ఉచిత టైలరింగ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు కూకట్ పల్లి బ్రాంచ్ డైరెక్టర్ దీపిక తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో ఉద్యోగ, స్వయం ఉపాధి అవకాశాలు కలిగిన ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల పట్ల మహిళలు ఎక్కువగా ఆసక్తి చూపు తున్నారని అన్నారు. ఇటువంటి వృత్తి విద్యా కోర్సుల ద్వారా మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆమె పేర్కొన్నారు. సంస్థ మంచి ఉద్దేశంతో మహిళలకు ఫ్యాషన్ డిజైనింగ్, టైలరింగ్ రంగంలో అవగాహన కల్పించేందుకు 15 రోజుల ఉచిత శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోర్స్ పూర్తి చేసిన అనంతరం సర్టిఫికెట్స్ ఇవ్వబడుతుందని ఆమె తెలిపారు . ఈ కోర్సులో రోజుకు 3 గంటల శిక్షణ అందించబ డుతుం దని చెప్పారు. ఈ శిక్షణలో రోజుకు రెండు బ్యాచ్ లు ఉంటాయి:మొదటి బ్యాచ్: ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు రెండవ బ్యాచ్: మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుంది. ఈ నెల 16వ తేదీ నుండిశిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. టైలరింగ్ నేర్చుకోవాలనుకునే ఆసక్తి గల మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం సెల్: 9573909009/9030610055 నంబర్ లలో సంప్రదించండి.

# విద్యార్థులు కొత్త నైపుణ్యాలు నేర్చుకోవాలి: మంత్రి వివేక్ వెంకటస్వామి





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్ 13 :-మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన సాప్ కోడ్ ఇనోవేషన్ 2025--26 కార్యక్రమాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన సాప్ కోడ్ ఇనోవేషన్ గదిని మంత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించడంతో పాటు కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ మంచి ఆలోచనతో ఈ విద్యాసంస్థను స్థాపించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలంటే శ్రద్ధగా వినడం, క్రమశిక్షణతో చదవడం ఎంతో అవసరమని సూచించారు. తన విద్యార్థి దశలో జరిగిన ఒక అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ, ఏ పని చేసినా ఆసక్తితో నేర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రస్తుతం ప్రపంచంలో వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని చూసి భయపడకుండా వాటిని అవగాహన చేసుకుని నేర్చుకుంటేనే భవిష్యత్తులో మంచి అవకాశాలు లభిస్తాయని అన్నారు. కార్యక్రమంలో మాట్లాడిన కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాప్ కోడ్ ఇనోవేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి వివేక్ వెంకటస్వామికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వివిధ కళాశాలల నుంచి వచ్చి సాప్ కోడ్ ఇనోవేషన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు మంత్రి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీ జంగయ్య, జిల్లా కాంగ్రెస్ నాయకులు మహేష్ గౌడ్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు సేవలు చిరస్మరణీయం: కొత్తకుర్మ శివకుమార్



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 13:- ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే శ్రీ కొండిగారి రాములు మరణ వార్త తెలుసుకొని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కార్యదర్శి కొత్తకుర్మ శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో ఉన్న రాములు నివాసానికి వెళ్లి, ఆయన భౌతిక కాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొత్తకుర్మ శివకుమార్ మాట్లాడుతూ, కొండిగారి రాములు ప్రజాసేవకు అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడని తెలిపారు. 1986 నుండి 1996 వరకు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసి ఇబ్రహీంపట్నం ప్రాంత అభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆయన మరణం ప్రాంత ప్రజలకు తీరని లోటని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని కొండిగారి రాములు కి ఘనంగా నివాళులర్పించారు.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు




హైదరాబాద్, మార్చి 13: తెలంగాణ జాగృతి స్టూడెంట్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు గుమ్మడి క్రాంతి ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణగూడ చౌరస్తా లో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా విద్యార్థి నాయకులతో కలిసి ఆయన కేక్ కట్ చేసి కవితక్క జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గుమ్మడి క్రాంతి మాట్లా డుతూ ఉద్యమ నేత తెలంగాణ సాంస్కృతిక విలువలను ప్రపంచానికి పరిచయం చేయడంలో కవితక్క చేసిన కృషి అభినందనీయమని అన్నారు. మహిళా సాధికారత, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పోరాటం చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్నారని తెలిపారు. అక్క నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో తెలంగాణ ప్రజల ఆశీస్సుల తో ము నుముందు ఎన్నో గొప్ప శిఖరాలను అలంకరించాలని కోరుకుంటున్నామని ఆయన తెలిపారు.

# మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు పార్థివదేహానికి మర్రి నిరంజన్ రెడ్డి నివాళి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్ 13:- ఇబ్రహీంపట్నం బృందావన్ కాలనీలోని నివాసంలో మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు పార్థివదేహానికి టిపిసిసి సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా మర్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి రెండు పర్యా యాలు ఎమ్మెల్యేగా సేవలందించిన కొండిగారి రాములు నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేసిన నికార్సైన కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడని అన్నారు. ప్రజాసేవకు అంకిత భావంతో పనిచేసిన ఆయన మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఒక గొప్ప ఆదర్శ నాయకుడిని కోల్పోయిందని, సమాజ అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ మాజీ అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, నాయకులు మంకాల దాస్, యాదగిరి, కౌన్సిలర్ నీళ్ల హరిదాసు గౌడ్, సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచ్ భూపతి గళ్ళ రాజు తదితర వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, బంధుమిత్రులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# పదో తరగతి విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు

**- ధైర్యం, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి**



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్13:-తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా పదో తరగతి (ఎస్ఎస్సీ) పరీక్షలకు హాజరుకాబోతున్న లక్షలాది మంది విద్యార్థులకు ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు తొలి మెట్టుగా భావించే ఈ పరీక్షలను ప్రతి ఒక్కరు ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని ఆయన సూచించారు. భయం, ఆందోళన, ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన మనసుతో పరీక్షలు రాస్తే తప్పకుండా మంచి ఫలితాలు సాధించవచ్చని సీఎం తెలిపారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను నమ్ముకుని ఆత్మవిశ్వాసంతో ముం దుకు సాగాలని విద్యార్థినీ, విద్యా ర్థులకు పిలుపునిచ్చారు.

పరీక్షలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన నేపథ్యంలో, ప్రశాంతమైన వాతావరణంలో పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసి ప్రతి విద్యార్థి ఉజ్వలమైన భవిష్యత్తుకు ముందడుగు వేయాలని సీఎం అభిలషించారు.

# గ్యాస్ సిలిండర్ల కొరతపై అపోహలు వద్దు రబీ పంటలకు సాగునీరు, వరి కొనుగోలుపై ప్రభుత్వం అప్రమత్తం






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్ 13 :-రంగారెడ్డి జిల్లా, గ్యాస్ సిలిండర్ల సరఫరా, రబీ పంటలకు సాగునీటి అందుబాటు, వరి ధాన్యం కొనుగోలు అంశాలపై శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎటువంటి గందరగోళానికి గురికావొద్దని తెలిపారు. గృహ వినియోగదారులకు అవసరమైనంత గ్యాస్ సరఫరా ప్రభుత్వం అందిస్తుందని భరోసా ఇచ్చారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రబీ సీజన్లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా సంబంధిత శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పంటల కోత పూర్తయ్యే వరకు కింది స్థాయి నుంచి పైస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. జిల్లాల కలెక్టర్లు నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రైతుల పంటలు చేతికొచ్చే వరకు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వరి ధాన్యం కొనుగోలు కోసం తగు చర్యలు తీసుకుని పంటల నిల్వ కేంద్రాలను గుర్తించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఆయిల్ పామ్, ఉద్యాన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల కొరతపై కొన్ని మాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తలపై ప్రజలు అపోహలకు గురికాకుండా అధికారులు గ్యాస్ ఏజెన్సీలపై పర్యవేక్షణ కొనసాగించాలని అన్నారు. గ్యాస్ నిల్వలు తగ్గిపోతాయనే అపోహతో వినియోగదారులు ముందుగానే బుకింగ్ చేయకుండా ఉండేందుకు బుకింగ్ వ్యవధిని 15 రోజుల నుంచి 25 రోజులకు పెంచినట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 99 రోజులపాటు విజయవంతంగా కొనసాగించాలని ఆదేశించారు. ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలను నిర్వహించి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు.

సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమావేశమైన కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు గృహ వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు ఈ విషయంలో నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, మేనేజర్ హరీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, ఇరిగేషన్ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ వ్యవసాయ మార్కెట్ లో రైతుల పంట అమ్మకం పై ఆర్థిక భారాన్ని తగ్గించాలి

**- దడువాయిల చార్జీలు మార్కెట్ కమిటీ భరించాలి.**

**- జిల్లా అదనపు కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చిన రైతు సంఘాల నాయకులు**



హైద్రాబాద్ ఎస్టేట్ వరంగల్ జిల్లా ప్రతినిధి ప్రకాష్ : వరంగల్ వ్యవసాయ మార్కెట్లో రైతుల పంట అమ్మకంపై ఆర్థిక భారాన్ని వేయవద్దని, ఈరోజు రైతు సంఘాల నాయకులు జిల్లా అసిస్టెంట్ కలెక్టర్ గారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కు రైతులు పండించిన పంటను అమ్ము కోవడానికి తూకం వేసే దాడువాయి లకు మార్కెట్ కమిటీ బస్తా ఒకన్టికి 6.25 రూపాయల చొప్పున రైతులే చెల్లిస్తున్నారు . దాడువాయిలకు రెండు సంవత్సరాలకు ఒకసారి 20% రేట్లు జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో పెంచుతున్నారు. వీరికి 1963 సంవత్సరం నుండి కొన్ని సంవత్సరాలు మార్కెట్ కమిటీ చెల్లించేది, మళ్లీ కొన్ని సంవత్సరాల రైతుల పంటను కొనుగోలు చేసే వ్యాపారస్తులు చెల్లించేవారు. 2012 సంవత్సరంనుడీ రైతులు చెల్లించే విధంగా ప్రభుత్వ అధికారులు గెజిట్ ను విడుదల , చేయడంతో ఆనాటి నుండి ఈరోజు వరకు రైతులే భరిస్తున్నారు.రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్లో కి అమ్ముకోవడానికి తీసుకొస్తే అనేకమైన ఖర్చులనేపంతో వారిపై ఆర్థికంగా భారం మోపుతున్నారు. రైతులు ఈ ఖర్చుల భారం మోయలేక మార్కెట్లోకి పంటను తీసుకురాకుండా గ్రామాల్లోని ప్రవేటు వ్యాపారస్తులకు పంటను అమ్ముకోవడంతో మార్కెట్కు వచ్చే కోట్ల ఆదాయాన్ని రాకుండా పోతున్నది.రైతులు గ్రామాలలో ప్రైవేటు వ్యాపారులకు అమ్మడం వలన సరైన ధర కూడా అందడం లేదు . రైతులపై ఖర్చుల భారాన్ని తగ్గియ్యాలని ప్రభుత్వాలు అంటూనే ఉన్నాయి కానీ ఈరోజు వరకు అమలు చేయడం లేదు . ఇప్పటికైనా మార్కెట్లోని దడువాయి ల చార్జీలు మార్కెట్ కమిటీ లు చెల్లించాలని మేము డిమాండ్ చేస్తున్నాం

వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ గారిని కలిసి వినతి పత్రం ఇచ్చిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు అఖిల భారత కిసాన్ సంఘటన్ జిల్లా అధ్యక్షులు సుధమల్ల భాస్కర్ మరియు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఓదెల రాజయ్య బండి వెంకటేశ్వర్లు ఉన్నారు.

# మార్చి 23న ఇబ్రహీంపట్నంలో అంబేద్కర్ చౌరస్తా నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ భారీ పాదయాత్ర



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్ 13 :-ఇబ్రహీంపట్నం, గ్రామాల్లో భూ సమస్యలు, ఇళ్ల స్థలాల సమస్యలు, ఇందిరమ్మ ఇళ్ల సమస్యలు, రేషన్ కార్డుల సమస్యలు తదితర ప్రజా సమస్యల పరిష్కారం కోసం మార్చి 23న ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా నుంచి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు భారీ పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి మడుగుల యాదయ్య తెలిపారు. శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదల భూ సమస్యలు సంవత్సరాలుగా పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా పేదలకు ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ విధానాలు సరైన రీతిలో అమలు కావడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇళ్ల పథకాలు ప్రజలకు అందకపోవడంతో వేలాది కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. 2005లో ప్రారంభమైన ఇళ్ల పథకాల నుంచి 2025 వరకు కూడా అనేక మంది పేదలకు ఇళ్లు లభించలేదని అన్నారు. గ్రామాల్లో భూమిలేని పేదలకు భూములు కేటాయించడం, ఇళ్ల నిర్మాణానికి స్థలాలు ఇవ్వడం, పేదలకు గృహాలు నిర్మించడం వంటి అంశాల్లో ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొనేలా మార్చి 23న అంబేద్కర్ చౌరస్తా వద్ద నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ(ఎం) నాయకులు పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాసంఘాల ప్రతినిధులు, పేదలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు.

అంతేకాకుండా జిల్లా నాయకులు డి. రాంచందర్, డి. సతీష్, కందికొండ జగన్, బి. నర్సింహ, బి. జగదీష్ తదితరులు ఈ కార్యక్రమానికి మద్దతు తెలిపారు.

# అత్యాశకు పోతే ఆర్థిక నష్టం తప్పదు

**- తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు**




హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి ) :రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ కార్యక్రమంలో భాగంగా మద్దిరాల పోలీసుల ఆధ్వర్యంలో మద్దిరాల మండల కేంద్రంలో సామాజిక రక్షణ అంశాల పట్ల స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహారావు మద్దిరాల ఎస్సై వీరన్న పాల్గొని అవగాహన. సందర్భంగా సిఐ నరసింహారావు మాట్లాడుతూ 99 రోజుల కార్యచరణ కార్యక్రమాలలో పోలీస్ శాఖ తరపున ప్రజలకు రక్షణ అంశాల పట్ల అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. దీనిలో భాగంగానే మద్దిరాల పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసి రోడ్డు భద్రతా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించడం జరిగింది. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ చెప్తూ ఉన్న పరిస్థితులను ప్రమాదాలను అడ్డంకులను గమనించాలని సూచించారు ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని అన్నారు తప్పుడు మార్గంలో వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలియజేశారు.. ప్రజలు రోడ్డు నియమ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాల నుండి రక్షణ పొందాలని ప్రతి ఒక్కరు సురక్షిత గమ్యం చేరుకోవాలని కోరారు. అలాగే సైబర్ మోసాలను నివారించాలంటే అవగాహన అప్రమత్తత కలిగి ఉండాలని అపరిచితులకు వ్యక్తిగత సమాచారాన్ని ఫోటోలను ఇవ్వకూడదని కోరారు. బహుమతులు ఉన్నాయి ఉచితాలు ఉన్నాయి అంటే అత్యాశకు పోతే ఆర్థిక నష్టం తప్పదని గుర్తు చేశారు. మహిళలు పిల్లల భద్రతకు అత్యంత ప్రాధాన్యమిస్తున్నామని వేధింపులకు గురవకుండా ఉండడాలంటే ధైర్యంగా ఫిర్యాదులు చేయాలని అన్నారు. డ్రగ్స్ మత్తులో ప్రజలు యువత అనారోగ్యం పాలవుతున్నారని మత్తు వల్ల ఏం చేస్తున్నామో తెలియని స్థితిలో నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు డ్రగ్స్ ఉన్న నిర్మూలించడానికి ప్రజలు పోలీస్ తో భాగస్వామ్యమై డ్రగ్స్ గంజాయి లాంటి వాటి గురించి సమాచారం ఇవ్వాలని కోరారు.

శనివారం, మార్చి 14, 2026

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# పేదల సంక్షేమమే లక్ష్యం అభివృద్ధి పనులతో ముందుకు ప్రభుత్వం

**– తెలంగాణ రెవిన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**





(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్13:-ఖమ్మం జిల్లా, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా పాలన సాగుతోందని, సంక్షేమ పథకాలతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి తమ ప్రభుత్వం సమాంతరంగా ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి తిరుమలాయపాలెం మండలంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందజేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలోనే బీరోలు గ్రామ అభివృద్ధికి రూ.29.92 కోట్లు మంజూరు చేయడం గమనార్హమని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.2.59 కోట్లతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, రూ.64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ రహదారుల పనులకు మంత్రి భూమిపూజ చేశారు.

అలాగే బంధంపల్లిలో రూ.5.50 కోట్లతో దమ్మాయిగూడెం--సోలిపురం రహదారి మధ్య నిర్మించనున్న హై లెవెల్ వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రహదారులు, కల్వర్టులు, చెరువుల మరమ్మత్తులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరుతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తూ రైతులకు అండగా నిలుస్తున్నామని మంత్రి వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని చెప్పారు.

ఇక నిరుద్యోగ యువతకు భరోసా కల్పిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా 72 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో పేదల చెంతకు చేరుతామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఆకేరు వాగు ముంపునకు గురైన రాకాసితండా బాధితులను మంత్రి పరామర్శించి, వారికి ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. అలాగే రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ ధర్మకర్తలను శాలువాలతో సత్కరించారు.

# పదో తరగతి విద్యార్థులకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా శుభాకాంక్షలు



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 13:- హైదరాబాద్, పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలను ఒత్తిడిగా భావించకుండా, తమ జ్ఞానం మరియు ప్రతిభను ప్రదర్శించుకునే మంచి అవకాశంగా భావించాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు ఆత్మవి శ్వాసంతో, సానుకూల దృక్పథంతో పరీక్షలకు సిద్ధమవ్వాలని గవర్నర్ పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండి, సమయాన్ని సమర్థంగా వినియోగించుకుంటే ఉత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు. ఆత్మవిశ్వాసమే విజయానికి ప్రధాన బలం అని ఆయన చెప్పారు. విద్యార్థుల విజయంలో కీలక పాత్ర పోషిస్తున్న తల్లిదండ్రులు మరియు ఉపాధ్యా యులను కూడా గవర్నర్ అభినందించారు. వారి సహకారం వల్లే విద్యార్థులు ధైర్యంగా పరీక్షలకు ఎదుర్కొంటారని అన్నారు. పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించి తమ భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దుకోవాలని గవర్నర్ ఆకాంక్షించారు.

# పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమాంతర ప్రాధాన్యం, మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**– తిరుమలాయపాలెం మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు లబ్ధిదారులకు సంక్షేమ పథకాల పంపిణీ**

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మార్చ్13:-ఖమ్మం జిల్లా, రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పాలన సాగుతోందని, సంక్షేమ పథకాల అమలుతో పాటు మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం సమాంతరంగా ప్రాధాన్యం ఇస్తోందని తెలంగాణ రెవె న్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.శుక్రవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో మంత్రి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ప్రయోజనాలు అందజేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన రెండు సంవత్సరాల మూడు నెలల కాలంలోనే బీరోలు గ్రామ అభివృద్ధికి రూ.29.92 కోట్ల నిధులు మంజూరు చేయడం గమనార్హమని మంత్రి పేర్కొన్నారు. ఇందులో భాగంగా రూ.2.59 కోట్ల వ్యయంతో బీరోలు నుంచి ఏలువారిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రహదారి పనులకు, రూ.64 లక్షలతో ఎస్సీ కాలనీలో నిర్మించనున్న సీసీ



రహదారుల పనులకు మంత్రి భూమిపూజ చేశారు. అదేవిధంగా బంధంపల్లిలో రూ.5.50 కోట్లతో దమ్మాయిగూడెం--సోలిపురం రహదారి మధ్య నిర్మించనున్న ఎత్తైన వంతెన పనులకు శంకుస్థాపన చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న రహదారులు, కల్వర్టులు, చెరువుల మరమ్మత్తులు వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం సరఫరా, కొత్త రేషన్ కార్డుల మంజూరు వంటి సంక్షేమ కార్యక్రమాలతో పాటు సన్న వడ్లకు రూ.500 బోనస్ అందిస్తూ రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా వంటి పథకాల ద్వారా రైతుల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నామని చెప్పారు.

అలాగే నిరుద్యోగ యువతకు అవకాశాలు కల్పించేందుకు గతంలో ఎన్నడూ లేని విధంగా 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలతో పేదల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. ఆకేరు వాగు ముంపునకు గురైన రాకాసితండా బాధితులను మంత్రి పరామర్శించి, వారికి ఇందిరమ్మ గృహాల మంజూరు పత్రాలను అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ధర్మకర్తలను శాలువాలతో సత్కరించారు.

# శ్రీశ్రీ తెలుగు తొలి కవయిత్రి మొల్లమాంబ జయంతి ఘనంగా నిర్వహణ





(హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి) :కందుకూరు, మార్చి 13:కందుకూరు మండల కేంద్రంలో శ్రీశ్రీ తెలుగు తొలి కవయిత్రి మొల్లమాంబ 586వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కందుకూరు మండల కుమ్మర సంఘం అధ్యక్షులు బొడ్డుపల్లి రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రముఖ సామాజిక నాయకుడు జపాల సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జపాల సుధాకర్ మాట్లాడుతూ, ఆనాటి కాలంలో స్త్రీలకు విద్య అవసరం లేదని భావించిన సమాజానికి తన ప్రతిభతో సమాధానం చెప్పిన గొప్ప కవయిత్రి మొల్లమాంబ అని పేర్కొన్నారు. ఆమె తన రచనల ద్వారా తెలుగు సాహిత్యానికి విశిష్ట స్థానం సంపాదించిందని అన్నారు.మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షులు ఎగిరి శెట్టి బాలయ్య మాట్లాడుతూ, 15వ శతాబ్దానికి చెందిన మొల్లమాంబ రామాయణాన్ని సరళమైన తెలుగులో అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించిన తొలి కవయిత్రి అని తెలిపారు. సమాజంలో అందరూ ఏకతాటిపై నడుస్తూ సంఘటితంగా ముందుకు సాగాలని, ఆర్థిక, రాజకీయ, విద్యా రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కందుకూరు సర్పంచ్ సరికొండ పాండు, ఉప సర్పంచ్ మమతా వెంకటేష్, నిమ్మ రాజశేఖర్ రెడ్డి, సిరిగిరి కవిత పాల్గొన్నారు.అలాగే కుమ్మర సంఘం నాయకులు కాసుల మహేందర్, ఆలూరి నరేష్, పూజా హరిబాబు, కుమ్మరి నరేష్, సురేష్, కుమ్మరి మధు, కుమ్మరి రాజశేఖర్, కుమ్మరి రాజు, రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆలూరి జంగయ్య, ఉపాధ్యక్షులు కుమ్మరి సురేష్, కార్యదర్శి కుమ్మరి రమేష్, కోశాధికారి కుమ్మరి లింగం తదితరులు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో మండల శాలి వాహన సంఘ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిస్వార్థ ప్రజా నాయకుడు కొండిగారి రాములు

**-సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ**

**-సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి**

(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 13:-ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుండి ఏమ్మెల్యేగా రెండు పర్యాయలు గెలిచి ఎలాంటి స్వార్థం లేకుండా నిస్వార్థంగా జీవించిన వ్యక్తి కామ్రేడ్ కొండిగారి రాములు అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారీ మరియు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి గార్లు అన్నారు.

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు ఇబ్రహీంపట్నం మాజీ ఏమ్మెల్యే కామ్రేడ్ కొండిగారి రాములు శుక్రవారం ఉదయం అనారోగ్యంతో మరణించారు.ఈ సందర్భంగా సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల సమితి ఆధ్వర్యంలో రావి నారాయణ రెడ్డి ఫేజ్ 3 భూ పోరాట కేంద్రంలో అయన చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.ఈ సందర్భంగా ఆందోజు రవీంద్ర చారీ మాట్లాడుతూ సర్పంచ్ గా గెలిచినా వాళ్లే ఆస్తులు కూడా బెట్టుకుంటున్న కాలంలో చిన్నప్పటి నుండే కమ్యూనిస్టు బావాలు కలిగి రెండు సార్లు ఏమ్మెల్యే గా పని చేసిన కూడా ఎలాంటి ఆస్తులు పోగు చేయకుండా కేవలం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం మాత్రమే పాటు పడ్డారని అన్నారు.ఎమ్మెల్యే అయిన కూడా బస్సుల్లో ప్రయాణం చేసి సైకిల్ తొక్కి సాధారణ జీవితం గడిపిన నిరుపేదల నాయకుడు రాములు అని.తను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఎన్నో తండలకి రోడ్లు వేసి కరెంట్ సదుపాయం కల్పించారాని గుర్తు చేశారు.నేటితరం యువత కొండిగారి రాములు గురించి తెలుసుకోవాలని వెనకబడిన కులాలపైన జరిగే దాడులని ఖండిస్తూ కుల వివక్షకి వ్యతిరేకంగా కూడా కొండిగారి రాములు పోరాటం చేశారాని గుర్తు చేశారు.ముత్యాల యాదిరెడ్డి మాట్లాడుతూ కొండిగారు రాములు తన బాల్యలో కూడా తెలంగాణ రైతంగా సాయుధ పోరాటంలో తన వంతు పాత్ర పోషించరాని.బ్రతికినంత కాలం కమ్యూనిస్టు భావాలతోనే ప్రజల కొరకే జీవించారాని.నేడు కోట్ల రూపాయల సంపాదనే లక్ష్యంగా పని చేస్తున్న ప్రస్తుత ప్రజా ప్రతినిధులు రెండు సార్లు ఏమ్మెల్యే అయినా కూడా అత్యంత సాధారణ జీవితం గడిపిన కొండిగారి రాములు గారి జీవితాన్ని ఆదర్శంగ తీసుకోని ప్రజల శ్రేయస్సుకి పాటు పడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె





నర్సింహా,సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్,బిఓసి జిల్లా కార్యదర్శి ప్రసాద్,మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు అరుణ,సిపిఐ నాయకులు నవనీత, మధు,రాములు, గణేష్,యాదగిరి, నిరంజన్,గోపి,వీరేష్,శ్రీధర్ రెడ్డి,నీలా, వీణ, కావేరి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు పార్థివ దేహానికి డిజిపి బత్తుల శివధర్ రెడ్డి నివాళి



(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చి 13:-ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు పార్థివ దేహానికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు శ్రద్ధాంజలి ఘటిస్తున్నారు. ఈ సందర్భంగా డిజిపి బత్తుల శివధర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆయన నివాసానికి చేరుకుని పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు కొండిగారి రాములు సేవలను స్మరించుకున్నారు. ప్రజలకు అంకితభావంతో పనిచేసిన గొప్ప నాయకుడని, ఇబ్రహీంపట్నం ప్రాంత అభివృద్ధికి ఆయన చేసిన కృషి మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన మరణం ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాములు పార్థివ దేహానికి నివాళులు అర్పించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక

# దిల్‌సుఖ్ నగర్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఫెయిర్





ఎల్బీనగర్ 13మార్చి హైదరాబాద్ స్టేట్ న్యూస్ ప్రతినిధి :స్టార్ త్రినేత్రం, దిల్?సుఖ్?నగర్: విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, సృజనాత్మక ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతో దిల్?సుఖ్?నగర్ బ్రాంచ్ దిల్?సుఖ్?నగర్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం 'సైన్స్ ఫెయిర్' అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ విజేత రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనను ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో ప్రాథమిక స్థాయి నుండి ఉన్నత పాఠశాల విద్యార్థుల వరకు వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, సౌర శక్తి వినియోగం, రోబోటిక్స్, స్మార్ట్ సిటీ నమూనాలు మరియు వ్యర్థాల నుండి సంపద తయారీ వంటి వినూత్న అంశాలపై విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రతి ప్రాజెక్టు వెనుక ఉన్న శాస్త్రీయ సూత్రాలను విద్యార్థులు ఎంతో ఆత్మవిశ్వాసంతో వివరించారు. పాఠశాల డైరెక్టర్ విజేత రెడ్డి, ప్రిన్సిపల్ రీమా ముఖర్జీ, ప్రైమరీ ఇంచార్జ్ లావణ్య ప్రతి స్టాల్‌ను సందర్శించి, విద్యార్థులతో ముచ్చటించి వారి ఆలోచనా దృక్పథాన్ని అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ విజేత రెడ్డి మాట్లాడుతూ..నేడు మన పాఠశాలలో ఏర్పాటు చేసిన ఈ సైన్స్ ఫెయిర్‌ను చూస్తుంటే చాలా గర్వంగా ఉందన్నారు. ఇంతటి అద్భుతమైన ప్రదర్శనను సిద్ధం చేసిన విద్యార్థులందరికీ ఆమె హృదయపూర్వక అభినందనలు తెలిపారు. సైన్స్ అనేది కేవలం పుస్తకాల్లో ఉండే పాఠం కాదని, అది నిత్యం మన చుట్టూ జరిగే ఒక ప్రక్రియ అని పేర్కొన్నారు. నేటి బాలలే రేపటి శాస్త్రవేత్తలు అనే విషయాన్ని ఈ ప్రదర్శన మరోసారి నిరూపించిందని, విద్యార్థుల్లోని జిజ్ఞాస, కొత్త విషయాలను తెలుసుకోవాలనే తపనే వారిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ఆకాంక్షించారు. ముఖ్యంగా పర్యావరణ సమస్యలకు పరిష్కారాలు చూపేలా రూపొందించిన మోడల్స్ చాలా వినూత్నంగా ఉన్నాయని ఆమె కొనియాడారు. కేవలం మార్కుల కోసమే కాకుండా, జ్ఞానం కోసం చదవాలని, ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రతి చిన్న ప్రయోగం ఒక పెద్ద ఆవిష్కరణకు పునాది కావాలని, థామస్ ఆల్వా ఎడిసన్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సైన్స్ ఫెయిర్ విజయవంతం కావడానికి సహకరించిన ఉపాధ్యాయ బృందానికి మరియు తల్లిదండ్రులకు విజేత రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రీమా ముఖర్జీ, ప్రైమరీ ఇంచార్జ్ లావణ్య, పాఠశాల సిబ్బంది మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు



హైదరాబాద్ ఎస్టేట్ మద్దిరాల (ప్రతినిధి ) :మండల కేంద్రంలోని రెసోనన్స్ స్కూల్ లో స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయని పాఠశాల ప్రిన్సిపల్ పాల బిందెల శ్రీనివాస్ కరస్పాండెంట్ శిరంశెట్టి వెంకన్న లు తెలిపారు విద్యార్థులే ఉపాధ్యాయులై వారి యొక్క టాలెంట్ ను బయటకు తీసి ఉత్సావరితమైన వాతావరణంలో బోధించి విద్యార్థులు చాలా ఆనందపడ్డారు ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు యాజమాన్యం ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# వేములవాడ ఏరియా ఆసుపత్రిలో నిర్లక్ష్యం గర్భిణీకి నరకయాతన, వైద్యులు లేక ఇబ్బందులు




(హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి) మార్చ్ 13:-రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ: వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలపై తీవ్ర నిర్లక్ష్యం బయటపడింది. అత్యవసర స్థితిలో ఆసుపత్రికి వచ్చిన ఓ గర్భిణీ పట్ల ఆసుపత్రి సిబ్బంది వ్యవహరించిన తీరు స్థానికంగా ఆగ్రహానికి దారితీసింది. రుద్రంగి మండలానికి చెందిన గర్భిణీకి ప్రసవ వేదనలు ప్రారంభమవడంతో కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్ ద్వారా వేములవాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అయితే అక్కడ గత 45 రోజులుగా గైనకాలజిస్ట్ అందుబాటులో లేరని సిబ్బంది చెప్పి ఆమెను ఆసుపత్రిలో చేర్చేందుకు నిరాకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని కనీసం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు రిఫర్ లెటర్ ఇవ్వాలని 108 సిబ్బంది కోరినా, డ్యూటీలో ఉన్న నర్సు బాధ్యతారాహిత్యంగా స్పందించినట్లు ఆరోపణలు ఉన్నాయి. గైనకాలజిస్ట్ ఎందుకు లేరని ప్రశ్నించగా "ఉదయం వచ్చి సూపరింటెండెంట్‌ను అడుగు" అంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అంతేకాకుండా 108 అంబులెన్స్ సిబ్బందితో కూడా దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం.ఆసుపత్రి సిబ్బంది సహకరించకపోవడంతో గర్భిణీ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర సమయంలో చేతిలో డబ్బు కూడా లేదని, తమ పరిస్థితి ఏమిటని గర్భిణీ తండ్రి కన్నీరుమున్నీరయ్యారు. చివరకు కుటుంబ సభ్యులు గర్భిణీని సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఈ ఘటనపై స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ ఏరియా ఆసుపత్రిలో వెంటనే గైనకాలజిస్ట్‌ను నియమించాలని, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్పందించాలని బాధితులు, ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# యూనియన్ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయండి








హైదరాబాద్ ఎస్టేట్ మంచిర్యాల :ఏఐటీయూసీ నాయకులు సెంట్రల్ సెక్రటరీ అక్బర్ ఆలీ ఆధ్వర్యంలో ఆర్కేపి సి ఎచ్ పి లో సేవ్ సింగరేణి పోస్టర్ మరియు ఏప్రిల్ లో యూనియన్ తలపెట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్ మరియు కరపత్రం విడుదల చేయడం జరిగినది. కార్యక్రమాన్ని ఉద్దేశించి అక్బర్ ఆలీ మాట్లాడుతూ సింగరేణిలో రాజకీయ జోక్యం ఎక్కువైందని కేసీఆర్ ప్రభుత్వం సింగరేణిని దోచుకుందని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు అంతకంటే ఎక్కువగా చేస్తుందని ఎద్దేవా చేశారు టెండర్లలో కమిషన్లు సింగరేణికి రావాల్సిన 50 వేలకోట్ల రూపాయల బకాయిలు వెంటనే విడుదల చేయాలని అలాగే స్ట్రక్చర్ కమిటీ సమావేశాలలో ఒప్పుకున్న అంశాలను సర్క్యులర్ రూపంలో విడుదల చేయాలని సింగరేణి కార్మికుల సెక్స్ మీద ఇన్కమ్ టాక్స్ సింగరేణి సంస్థ భరించాలని సొంతింటి పథకం కంపెనీలో ఖాళీగా ఉన్నపోస్టులను ఇంటర్నల్ కార్మికులతో నింపాలని ఇంకా అనేక సమస్యలు ఉన్నాయని వాటిని వెంటనే సర్క్యులర్ రూపంలో విడుదల చేయాలన్నారు కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతలు అందించాలని తెలంగాణ లోని బొగ్గు బ్లాక్కులను సింగరేణి సంస్థకే కేటాయించాలని అన్నారు ఈ కార్యక్రమంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ ఇప్పకాయల లింగయ్య పిట్ సెక్రటరీ హరి రామకృష్ణ అసిస్టెంట్ సెక్రటరీ మాదాసి వేణుగోపాల్, కమిటీ సభ్యులు కృష్ణస్వామి, మండల శ్రీనివాస్ కుంభం శ్రీనివాస్ వెంకటస్వామి శ్రీకాంత్ రజిత అనిత మానస మొదలగువారు తదితరులు పాల్గొన్నారు.

# ఏయే అనారోగ్య సమస్యలు ఉన్నవారు చియా విత్తనాలను తీసుకోకూడదు.. జాగ్రత్తలు పాటించాల్సిందే..



చిన్నగా ఉన్నప్పటికీ చియా గింజలు అనేక పోషకాలను కలిగి ఉంటాయి. ఆరోగ్యకరమైన డైట్‌లో భాగంగా వీటిని తీసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలను పొందవచ్చు. వీటిలో ఒమెగా 3 ఫ్యాటీ ఆమ్లాలు, ఫైబర్, ప్రోటీన్, విటమిన్లు, ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. చియా గింజల్లో ఫైబర్ కూడా ఎక్కువగా ఉంటుంది. కనుక వీటిని తీసుకోవడం వల్ల జీర్ణక్రియతో పాటు జీర్ణవ్యవస్థ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. వీటిలో ఉన్న యాంటీ ఆక్సిడెంట్లు శరీరంలో ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి వాపును తగ్గించడంలో సహాయపడతాయి. చియా గింజలు నీటిని తమ బరువుకు 10-12 రెట్లు వరకు పీల్చుకుంటాయి. కనుక వీటిని తీసుకోవడం వల్ల శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. అలాగే ఎక్కువసేపు పొట్ట నిండిన భావన కలిగించి బరువు నియంత్రణకు కూడా సహాయపడతాయి.మింగడంలో ఇబ్బంది ఉంటే..అయితే చియా గింజలు ఆరోగ్యానికి మేలు చేసేవే అయినప్పటికీ ఇవి అందరికీ సరిపోవు. కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వీటిని జాగ్రత్తగా తీసుకోవాలి లేదా పూర్తిగా నివారించడం మంచిదని వైద్యులు చెబుతున్నారు. ఎటువంటి సమస్యలతో బాధపడే వారు చియా గింజలు తీసుకునే విషయంలో జాగ్రత్త వహించాలో ఇప్పుడు తెలుసుకుందాం.చియా గింజలు నీటిలో నానబెట్టినప్పుడు పరిమాణంలో పెరుగుతాయి. మింగడంలో ఇబ్బంది ఉన్నవారికి లేదా ఆహార నాళం సన్నగా ఉన్నవారికి ఇవి ప్రమాదకరంగా మారవచ్చు. అలాగే పొడిగా తింటే అరుదుగా ఆహారనాళం బ్లాక్ అయ్యే ప్రమాదం ఉంటుంది. కాబట్టి ఎప్పుడూ ముందుగా నీటిలో నానబెట్టే తినాలనే వైద్యులు సూచిస్తున్నారు.ఐబీఎస్ ఉంటే..చియా గింజల్లో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది. కనుక ×దీూ ఉన్న వారిలో ఇది పొట్ట ఉబ్బరం, గ్యాస్, అసౌకర్యం వంటి సమస్యలను పెంచవచ్చు. 2 టేబుల్ స్పూన్ల చియా గింజల్లో దాదాపు 10 గ్రాముల ఫైబర్ ఉంటుంది. ఒక్కసారిగా ఎక్కువ ఫైబర్ తీసుకుంటే ఉన్నవారికి ఇబ్బంది కలగవచ్చు. అలాగే రక్తాన్ని పలుచగా చేసే మందులు వాడే వారు కూడా వీటిని తీసుకునే విషయంలో జాగ్రత్త వహించడం మంచిది. చియా గింజల్లో ూూూ ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లం ఉంటుంది. ఇది కొంతవరకు రక్తాన్ని పలుచగా చేసే ప్రభావం కలిగించవచ్చు. అందువల్ల రక్తాన్ని పలుచగా చేసే మందులు తీసుకునే వారు ఎక్కువ పరిమాణంలో చియా గింజలు తినే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. అదే విధంగా కొందరిలో గాస్ట్రోపారేసిస్ లేదా ఇతర జీర్ణక్రియ మొటిలిటీ వంటి సమస్యలు ఉంటాయి. చియా గింజలు నీటితో కలిసినప్పుడు జెల్‌లా మారతాయి. ఈ జెల్‌లాంటి ఫైబర్ జీర్ణక్రియను మరింత కష్టతరం చేయవచ్చు.అలర్జీలు ఉన్నా..అలాగే కొంతమందికి ఈ గింజలకు అలర్జీ ఉండవచ్చు. అలాంటి వారికి చియా గింజలు తింటే అలర్జిక్ రియాక్షన్ వచ్చే అవకాశం ఉంది. చియా గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇవి ఫైబర్, ఒమెగా-3, పాలీఫీనాల్స్, ప్రీబయోటిక్ లాభాలు అందిస్తాయి. అయితే వీటిని తీసుకునే ముందు పరిమాణం, ఆరోగ్య పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవడం కూడా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. చియా గింజలను తీసుకునే సరైన పద్ధతి గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చియా గింజలు నీటిని ఎక్కువగా పీల్చుకుంటాయి కాబట్టి ముందుగా నానబెట్టి తినాలి. మొదట 1 టేబుల్ స్పూన్ తో ప్రారంభించాలి. నీరు, పెరుగు లేదా స్మూతీలో నానబెట్టి తీసుకోవడం మంచిది. తరువాత వీలును బట్టి నెమ్మదిగా 2 టేబుల్ స్పూన్ల వరకు పెంచుకోవచ్చు. చియా గింజలు చాలా పోషకమైన ఆహారం అయినప్పటికీ, కొన్ని ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి లేదా పూర్తిగా నివారించడం మంచిది అని వైద్యులు సూచిస్తున్నారు.

# మీ శరీరంలో తరచూ వాపులు కనిపిస్తున్నాయా..అయితే జాగ్రత్త..



సాధారణంగా శరీరంలో ఎక్కడైనా వాపు వస్తే దానిని కొందరు అంతగా పట్టించుకోరు. చిన్న సమస్యగా దానిని భావిస్తారు. నిలబడి ఉండడం, ఉప్పు ఎక్కువగా తీసుకోవడం లేదా అలసట వల్ల వచ్చిందని అనుకుంటారు. కానీ కొన్ని భాగాల్లో తరచూ లేదా నిరంతరంగా వాపు కనిపిస్తే అస్సలు తేలికగా తీసుకో కూడదు. ఇది అంతర్గత ఆరోగ్య సమస్యను సూచిస్తుందని భావించాలి. ఇలా వాపు ద్వారా సమస్యలను తెలియజేసే వాటిల్లో దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి కూడా ఒకటి. కిడ్నీలు సరిగ్గా పని చేయకపోవడం వల్ల శరీరంలో ఉన్న అదనపు ద్రవాలు, వ్యర్థ పదార్థాలు బయటకు వెళ్లవు. దీంతో శరీరంలో ద్రవం పేరుకుపోయి వాపు కనిపిస్తుంది. ఈ లక్షణాలను ముందుగానే గుర్తించడం ద్వారా త్వరగా చికిత్స తీసుకునే వీలు ఉంటుంది. సాధారణంగా ఆరోగ్యకరమైన కిడ్నీలు రక్తంలో ఉన్న వ్యర్థాలు, అదనపు ద్రవాన్ని ఫిల్టర్ చేసి మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. కానీ కిడ్నీల పనితీరు తగ్గితే శరీరంలోని కొన్ని భాగాల్లో ద్రవం చేరుతుంది. ఈ పరిస్థితిని వైద్యపరంగా ఎడిమా అంటారు. ఈ సమస్య సాధారణంగా నెమ్మదిగా ప్రారంభమై కాలక్రమేణా పెరుగుతుంది. దీంతో పాటు కిడ్నీ వ్యాధి వల్ల మూత్రం ద్వారా ప్రోటీన్ బయటకు పోతుంది.ఉదయం సమయంలో కళ్ల చుట్టూ వాపు..రక్తంలో ప్రోటీన్ తగ్గితే కూడా వాపు మరింతగా పెరుగుతుంది. ముఖ్యంగా ఉదయం సమయంలో కళ్ల చుట్టూ వాపు లేదా కళ్లు ఉబ్బినట్టుగా కనిపిస్తే అది కొన్ని సందర్భాల్లో కిడ్నీ సమస్యకు సంకేతం కావచ్చు. కిడ్నీ దెబ్బతినడంతో మూత్రంలో ప్రోటీన్ లీక్ అవుతుంది. దీంతో ద్రవ సమతుల్యత మారి కంటి పైపొరల వంటి సున్నితమైన కణజాలాల్లో ద్రవం చేరుతుంది. దీంతో విశ్రాంతి తీసుకున్నప్పటికీ కళ్ల చుట్టూ వాపు అలాగే కనిపించవచ్చు. అలాగే కిడ్నీ పనితీరు తగ్గినప్పుడు అదనపు ద్రవం పాదాలు, మడమల వద్ద ఎక్కువగా చేరుతుంది. ఇది గురుత్వాకర్షణ కారణంగా శరీరంలోని దిగువ భాగాల్లో నిల్వ అవుతుంది. దీనివల్ల షూస్ గట్టిగా అనిపించడం, సాక్స్ గుర్తులు పడటం వంటి లక్షణాలు కనిపించవచ్చు.పొట్ట ఉబ్బరం..అదే విధంగా ద్రవాలు నిల్వ ఉండడం వల్ల చేతులు, వేళ్లల్లో కూడా వాపు వస్తుంది. దీంతో ఉంగరాలు అకస్మాత్తుగా గట్టిగా అనిపించడం, వేళ్లు ఉబ్బినట్టుగా కనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వాపు ఎక్కువగా ఉదయం లేదా ఎక్కువ ఉప్పు ఉన్న ఆహారం తిన్న తర్వాత గమనించవచ్చు. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో ద్రవం పొత్తికడుపులో కూడా చేరవచ్చు. దీంతో పొట్ట ఉబ్బినట్టు కనిపించడం లేదా పొట్టలో అసౌకర్యంగా ఉండడం జరుగుతుంది. ఈ పరిస్థితిని అసైటిస్ అంటారు. ఇది తీవ్రమైన కిడ్నీ సమస్యలతో పాటు శరీరంలోని ద్రవ సమతుల్యతను ప్రభావితం చేసే ఇతర వ్యాధులతో కూడా సంబంధం ఉండవచ్చు. కిడ్నీ సమస్యలతో బాధపడే వారిలో వాపుతో పాటు ఇతర సమస్యలు కూడా కనిపిస్తాయి. అలసట, మూత్రం పరిమాణం తగ్గడం, నురుగుతో కూడిన మూత్రం రావడం, వాంతులు, మలబద్ధకం, కండరాల తిమ్మిర్లు, దురద వంటి ఇతర లక్షణాలు కూడా కనిపిస్తాయి.హైబీపీ, డయాబెటిస్ ఉంటే..హై బ్లడ్ ప్రెషర్, డయాబెటిస్ కిడ్నీ వ్యాధికి ప్రధాన ప్రమాద కారకాలని వైద్యులు చెబుతున్నారు. ప్రార ంభ దశలో ఎటువంటి లక్షణాలు కనిపించవవు. కానీ మూత్రపిండాలకు సంబంధించిన పరీక్షలు తరచూ చేయిం చుకోవ డం వల్ల సమస్యను ముందుగా గుర్తించే వీలు ఉంటుంది. దీంతో చికిత్స కూడా సులభతరం అవుతుంది. అయితే వాపు తరచూ రావడం, వాపు రోజురోజుకూ పెరగడం, అలసట, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది.

Printed, Published & Owned by BATTU LAXMI NARAYANA ; Printed at BATTU PRINTERS, PLOT NO 30, ROAD NO 2, MADHRA NAGAR, MANSURABAD, LBNAGAR R R DIST , TELANGANA,
Published from BATTU.PUBLICATIONS, H.NO PLOT NO 30 ,ROAD NO 2, MADHRA NAGAR, MANSURABAD ,LBNAGAR, R R DIST. Editor: BATTU LAXMI NARAYANA, CELL:9951693876